వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 15 అక్టోబర్ 2023

## దసరా ఉత్సవాలు జయప్రదం చేయండి

### – ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు



కడప వైద్యవిభాగం, అక్టోబరు 14, ప్రభాతవార్త

శ్రీశ్రీశ్రీ విజయ దుర్గాదేవి ఆల యంలో ఈనెల 15 నుంచి ప్రారంభ మయ్యే శరన్నవరాత్రి మహోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ వ్యవ స్థాపకులు సుధా మల్లికార్జునరావు కోరారు. ఆలయ సమావేశ మందిరంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 15న అమ్మవారు శైలపుత్రి అలంకారం, 16న బ్రహ్మచారిని, 17న చంద్రఘట్ట, 18న కుష్మాండదేవి, 19న స్కంద మాత, 20న కాత్యాయిని, 21న కాలరాత్రి, 22న మహా గౌరీ, 23న సిద్ధి ధాత్రి అలంకారంలో అమ్మవారి దర్శనం ఇస్తారని తెలిపారు. రాత్రి 8 గంటలకు అమ్మవారి ఆలయం నుంచి పురవీధుల్లో ఊరేగింపు ఉంటుం దని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## చంద్రబాబుకు ఏమి జరిగినా పూర్తి బాధ్యత ప్రభుత్వానిదే

### – మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్‌రెడ్డి

రాయచోటి, అక్టోబరు 14, ప్రభాతవార్త:

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాజమండ్రి సెంట్రల్ జైలులో ఆయనకు ఏమైనా జరిగినా ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని రాయచోటి నియోజక వర్గం తెదేపా ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాయచోటి పట్టణం ఎన్జీవో కాలనీలో శనివారం సాయంత్రం బాబుతోనే నేను కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రోడ్ల దుస్తితి చూస్తే ఆయన ఆందోళన కలుగుతోందన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డిని నాలుగుసార్లు గెలిపించినా రోడ్ల పరిస్థితి దారుణమన్నారు. అనంతరం రమేష్ కుమార్‌రెడ్డి ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబునాయుడకు ఓట్లు వేసి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బోనమల ఖాదర్‌వల్లీ, కొట్టే చలపతి, మదన్‌మోహన్ రాజు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా పాల్గొన్నారు.

## జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అందరికీ న్యాయం

### డిప్యూటీ సీఎం అంజాద్‌బాష





కడప అక్టోబర్ 14,ప్రభాతవార్త

రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కష్టపడి పని చేసిన ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందని ఉన్నత పదవులు అందుతా యని ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎస్.బి. అంజా ద్ భాష, ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి సంయుక్తంగా పేర్కొన్నారు. శనివారం స్థానిక రవీంద్ర నగర్ లోని యూఎస్ మహల్ ఫంక్షన్ హాల్ నందు జిల్లా వక్ఫ్ బోర్డ్ చైర్మన్, వైస్ చైర్మన్, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం పెద్ద ఎత్తున ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంజద్ భాష మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని సామాజిక వర్గాల వారికి, కష్టపడి పని చేసిన వారికి ఉన్నత పదవులు అందించి న్యాయం చేయడం జరుగుతోందని అన్నారు. గత ప్రభుత్వాలలో ఈ విధంగా అన్ని సామాజిక వర్గాల వారికి న్యాయం జరగలేదని ఈ సందర్భంగా అన్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన నాటునుండి ఎంతో కష్టపడి ఇబ్బందులను సమస్యలను అధికమించి న్యాయం చేస్తూ పని చేశారని అభినందిస్తూ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ గా పదవి రావడం ఎంతో సంతోషించ దగ్గ విషయమని అన్నారు. మదీనా దస్తగిరికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నా, ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి అన్నా, శాసనసభ్యులు ఎస్ రఘురామిరెడ్డి అన్నా తన కెంతో అభిమానం అని కష్టాలను నష్టాలను ఓర్చుకుంటూ జగనన్నను నమ్ముకొని రాజకీయాల్లో నిలదొక్కోవడం జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం లో ఎక్కువమంది ముస్లిం మైనార్టీలకు శాసన మండలిలో సభ్యులు గా ఉంచడం జరిగిందని అన్నారు.

కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి సామాజిక వర్గానికి న్యా యం జరుగుతుందని కష్టపడి పనిచేసి ఉన్నత పదవులను అందుకోవాలని అన్నారు. మైదుకూరు శాసనసభ్యులు ఎస్ రఘురామిరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూసామని ఏ ప్రభుత్వంలోనూ ఈ విధంగా ప్రతి సామాజిక వర్గానికి సమానంగా న్యాయం చేయలేదని ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి సామాజిక వర్గానికి పేరుపేరునా న్యాయం చేయడం జరిగిందని అన్నారు.

జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి మాట్లాడుతూ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ పదవి రావడం తనకెంతో సంతోషంగా ఉందని ముఖ్యమంత్రి మోహన్ రెడ్డి ఇచ్చిన పదవిని కష్టపడి పని చేసి మంచి పేరు ప్రతిష్టలు తెచ్చు కొంటానని అన్నారు. తాను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రేమాభిమానాలను చూసే రాజకీయాలలోకి అడుగు పెట్టడం జరిగిందని ఇది దైవ నిర్ణయంగా భావిస్తున్నానని అన్నారు. నాకు ఈ పదవి రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ భాష, ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, మైదుకూరు శాసనసభ్యులు ఎస్ రఘురామిరెడ్డి ఆశీస్సులతో లభించిందని అన్నారు. తనకు తోడ్పాటు నిలిచిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతాభివందనాలు తెలిపారు.

అనంతరం రాష్ట్ర హజ్ హౌస్ చైర్మన్ గౌస్ లాజం, మున్సిపల్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు ఇరగమ్ రెడ్డి తిరుపాల్రెడ్డి, రాష్ట్ర వైసీపీ సీనియర్ నాయకుల అఫ్జల్ ఖాన్, టీటీడీ బోర్డు మెంబర్ యాదయ్య, కాల్ టాక్స్ హాఫీసుల్లా, డాక్టర్ సోహెల్ అహమ్మద్ లు ప్రసంగించారు. తొలుత షేక్ మదీనా దస్తగిరి, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ తో పాటు జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ సయ్యద్ అలీ అక్బర్ (రిజ్వాన్),జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, రూపనగుడి అబ్దుల్ సుభాన్, షేక్ గౌస్ పీర్, పఠాన్ ఖాదిరుల్ల, చింతపల్లి షశావల్లి, ఇస్మాయిల్ సాబ్ గారి అన్వర్ సాబ్, షేక్ మహబూబ్ బాషా, షేక్ మహమ్మద్ ఉమర్, షేక్ కరిముల్లా లు జిల్లా వక్ఫ్ బోర్డు కార్యవర్గం సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం పెద్ద ఎత్తున వారికి పూలమాలలు వేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలి పారు. కార్యక్రమంలో నగర మేయర్ కే సురేష్ బాబు, రాష్ట్ర సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులిసునిల్ కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, నాయ కులు, నాయకురాళ్ళు, అభిమానులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రాణం తీసిన సరదా



### - ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

### - రోదించిన తల్లిదండ్రులు

కడప క్రైం, అక్టోబరు 14, ప్రభాతవార్త

సరదాగా ఈత కోసం వెళ్లి ప్రాణాలు కోల్పోయిన విదారకర ఘటన రిమ్స్ పరిధిలోని చలమారెడ్డిపల్లె కొండ ప్రాంతంలో శనివారం చోటు చేసుకుంది. శనివారం పాఠశాలకు సెలవు కావడంతో సరదాగా ఈతకు వెళ్లి స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన వెంకటసాయి(14), సుంకర శంకర్ (11) అనే ఇరువురు విద్యా ర్థులు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక తిలక్‌నగర్‌కు చెందిన సుంకర శ్రీను, లక్ష్మీదేవిల కుమారుడు వెంకటసాయి 9వ తరగతి చదువు తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన వెంకటమ్మ, పెంచలయ్య కుమారుడు సుంకర శంకర్ 6వ తరగతి చదువు తున్నాడు. శ్రీను, పెంచలయ్య దంపతులు కూలి పనులు చేసుకుంటూ జీవించేవారు. శనివారం ఈ కుటుంబ సభ్యులు యథావిధిగా కూలి పనులకు వెళ్లారు. అయితే 2వ శనివారం కావడంతో వెం కటసాయి, శంకర్ సరదా కోసం చలమారెడ్డిపల్లె సమీపంలోని కొండ దిగువ ప్రాంతంలో మైన్స్ కోసం తిసిన కకుంటలో దిగారు. అయితే లోతైన కుంటలో ఇద్దరు పడి బయటకు రాలేక అందులో చిక్కుకొని మృత్యువాత పడ్డారు. సమాచారం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మంచి చదువు చదివి ఆదుకుంటటారునుకున్న బిడ్డలు మృత్యువాత పడడంతో బోరున విలపించారు. రిమ్స్ ఎస్సై నారాయణ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## రాజంపేటకు దసరా శోభ

### విద్యుద్దీపాలంకరణలతో అమ్మవారి ఆలయాలు కళకళ


### నేటినుంచి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

రాజంపేట అర్బన్, అక్టోబరు 14 ప్రభాతవార్త

శరన్నవరాత్రి ఉత్సవాలకు రాజంపేట ముస్తాబైంది. జిల్లాలో ప్రొద్దుటూరు తర్వాత అత్యంత వైభవంగా దసరా వేడుకలు నిర్వహించే రాజంపేటలో నేటి నుంచి శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభం కానున్నాయి. స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాటు్లు చేశారు. గాంధీ విగ్రహం వద్ద అమ్మవారిశాల వీధిలో మైసూర్ తరహాలో భారీ సెట్టింగ్‌తో ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. గాంధీ విగ్రహం నుంచి ప్రధాన రహదారి వరకు వీధి మొత్తం విద్యుద్దీపాలతో, చలువ పందిళ్లతో అలంకరించారు. అమ్మవారిశాల ముఖద్వారం వద్ద కూడా కొత్తశోభ సంతరించుకుంది. ఆలయం లోపల రంగుల రంగుల విద్యుద్దీపాలతో కళ్లు మిరుమిట్లుగొలిపేలా అలంకరించారు. ఆలయం లోపల అష్టలక్ష్మి, అమ్మవార్లకు ఇరువైపులా స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. నేటి తెల్లవారుజమున 4 గంటల నుంచే భక్తుల ప్రదక్షిణల కోసం ఆర్యవైశ్య సంఘం ఏర్పాటు చేసింది. అలాగే చౌడేశ్వరి ఆలయం దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. వీధి మొత్తం విద్యుద్దీపాలతో అలంకరించారు. రెడ్డివారివీధిలో చౌడేశ్వరి ఆలయానికి పెద్ద సెట్టింగ్‌తో ముఖద్వారాన్ని ఏర్పాటు చేశారు. అదేవిధంగా సాధుకామాక్షమ్మ ఆలయంలో కూడా శరన్నవరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాటు్లు చేశారు. అంతేగాకుండా మన్నూరులోని చౌడేశ్వరి ఆలయం, ప్రధాన రహధారిలో ఉదయగిరి ఎల్లమ్మ ఆలయంలో కూడా శరన్నరాత్రి వేడుకలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. దీంతో రాజంపేట పట్టణం దసరా శోభతో కళకళలాడుతోంది. ప్రధాన రహదారిలోను, జీఎంసి క్లబ్ వద్ద, ఈడిగపాలెం మలుపు, మన్నూరు వద్ద అమ్మవారిని విద్యుద్దీపాలంకరణతో ఏర్పాట్లు చేశారు.




రాజంపేట అమ్మవారిశాలలో బంగారు చీరలో వాసవిమాత



విద్యుద్దీపాలంకరణలో జగజ్జనని



అమ్మవారిశాలవీధిలో భారీ సెట్టింగ్‌తో ముఖద్వారం



విద్యుద్దీపాల అలంకరణలో చౌడేశ్వరిదేవి ఆలయం


## క్రికెట్ బుకీలకు కౌన్సెలింగ్


ప్రొద్దుటూరు క్రైం, అక్టోబరు 14, ప్రభాతవార్త

ప్రపంచ క్రికెట్ కప్ సందర్భంగా శనివారం ఇండియా వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్‌కు క్రికెట్ బెట్టింగ్‌లు జరగకుండా జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు ఏఎస్పీ ప్రేరణ కుమార్ ఆద్వర్యంలో క్రికెట్ బుకీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. క్రికెట్ బెట్టింగ్, మట్కా, జూదం తదితర అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే పట్టణంలోని అన్ని లాడ్జీలు తనిఖీ చేసి ప్రధాన కూడళ్లలో అనుమానాస్పద వ్యక్తులను తనిఖీ చేసి క్రికెట్ బెట్టింగ్, మట్కా అక్రమ మద్యానికి పాల్పడిన వారిపై ప్రత్యేక దాడులు నిర్వహించారు. ప్రొద్దుటూరు సబ్ డివిజన్‌లోని అన్ని పోలీసు స్టేషన్లలో కలిపి మట్కా నిర్వహిస్తున్న 7 మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.60,900, మటట్కాకు సంబంధించిన మరియు క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.36వేలు నగదు స్వాధీనం చేసుకొని వీరిపై కేసు నమోదు చేయడం జరిగిందని పోలీసు అధికారులు తెలిపారు.



## అంగన్‌వాడీ పౌష్టికాహారం పక్కదారి మళ్లింపు





### – అంగన్‌వాడీ గుడ్లు బ్రాందీషాపు పక్క దుకాణాల్లో విక్రయాలు

### – లబ్ధిదారులకు అందలేదని గుసగుసలు

ఓబులవారిపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అందులోనూ పేద ప్రజలకు, విద్యార్థులకు, గర్భిణీలకు, బాలింతలకు ప్రభుత్వం అందించే అంగన్‌వాడీ కేంద్రాల నుంచి పౌష్టికాహార పిండి మరియు చక్కీలు, కోడిగుడ్లు పక్కదారికి మల్లించి కొందరు సొంత లాభాలు చూసుకుంటున్నారని ఆరోపణలు లేకపోలేదు. రైల్వేకోడూరు పట్టణంలోని ఓ బ్రాందీ షాపు పక్కన ఉన్న దుకాణంలో సమోసాల కోసం వెళ్లిన కొంత మందికి కోడిగుడ్లపైన అంగన్‌వాడీ గుర్తులు ఉండడంతో ఆ యజమానిని ప్రశ్నించగా అవి మేము అంగట్లో కొనుకున్నామని చెప్పుకొచ్చారు. కొంత మందది ప్రశ్నించగా అవి వేరే వారు మాకు అమ్మారని తెలిపారు. గతంలో కూడా ఓ బేకరీ షాపులో ఇలాంటి ఘటనలు జరిగాయని సొంత లాభాలకు కక్కుర్తి పడి స్వలాభాలు చూసుకుంటూ పేద ప్రజల కడుపు కొడుతున్నారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు చొరవ చూపి అర్హులకు అందాల్సిన అంగన్‌వాడీ పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## జర్నలిస్టులకు క్రీడలు అవసరం

### వైఎస్ఆర్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి





పులివెందుల, అక్టోబరు 14, ప్రభాతవార్త

నిత్యం మానసిక ఒత్తిడికి గుర వుతూ విధులు నిర్వహించే పాత్రికేయు లకు క్రీడలు చాలా అవసరమని వైఎస్ఆర్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి అన్నారు. పులివెందులలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఇండోర్ స్టేడియం లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జర్నలిస్టుల షటిల్ టోర్నమెంట్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి జర్నలిస్టుల క్రీడా పోటీలకు పులివెందుల వేదిక కావడం సంతోషంగా ఉంద న్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం నిరంతరం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని గుర్తు చేశారు. క్రీడలు మానసిక, శారీరక వికాసానికి ఉపయోగ పడతాయన్నారు. పులివెందుల ఏరియా డెవలప్‌మెంట్ ఏజన్సీ (పాడా) ఓఎస్డీ అనీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల క్రీడా పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు పులివెందులకు రావడం తమకు సంతోషకరమైన పరిణా మం అన్నారు. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధా న్యత ఇస్తోం దన్నారు. పులివెం దులలో రాష్ట్రస్థాయి క్రీడాకారులను తయారు చేయడానికి అవసరమైన క్రీడా మైదానాలను అభివృద్ధి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్య క్రమంలో పులివెందుల మార్కెట్ కమిటి ఛైర్మన్ చిన్నప్ప, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, సివిల్‌సప్లైస్ డైరెక్టరు గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులు పని ఒత్తిడితో మానసికంగా ఇబ్బంది పడకుండా ఉండేందుకు క్రీడలు ఎంతో ఉపయోగ పడతా యన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులు జర్నలిస్టులని, భవిష్యత్తులో ఏ కార్యక్రమం నిర్వహించుకున్నా తమ వంతు సహాయ, సహకారాలు అందిస్తా మన్నారు. వైఎస్ఆర్‌సీపీ కౌన్సిలరు పార్నపల్లె కిషోర్, వేంపల్లె సర్పంచి ఆర్.శ్రీనుతో పాటు వైఎస్ఆర్‌సీపీ నాయకులు కడియాల లక్ష్మినారాయణ, డేనియల్ పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాలు ఢీ

### – ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

సంబేపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి ఎర్రగుంట్ల బస్టాండు వద్ద శనివారం రాత్రి ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. రోడ్డు ప్రమాదంలో నాగేంద్ర(24) అక్కడికకక్కడే మృతి చెందాడు. అశోక్, అంజలి ఇరువురికి గాయాలయ్యాయి. పోలీసుల వివరాల మేరకు శెట్టిపల్లె గ్రామం దొడ్డిచేను, వడ్డిపల్లికి చెందిన పల్లపు నాగేంద్ర గత కొన్ని రోజులుగా నారాయణరెడ్డిపల్లె గ్రామం ముదినేని వడ్డీపల్లెలో నివాసం ఉన్నట్లు తెలిపారు. సొంత పనుల నిమిత్తం రాయచోటికి వచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా మోటకట్ల గ్రామం చెరువు ముందరపల్లెకు చెందిన అశోక్, అంజలి భార్యాభర్తలు ద్విచక్ర వాహనంలో రాయచోటి వెళ్తుండగా ఎర్రగుంట్ల బస్టాప్ వద్ద ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న ఎస్సై ఎస్ఎండీ షరీఫ్ సంఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ప్రజా సంక్షేమం కోసమే గడప గడపకు మన ప్రభుత్వం : డిప్యూటీ సీఎం 2లో

చంద్రబాబు అక్రమ అరెస్టును అందరూ ఖండించాలి 2లో

మహనీయుల బాటలో నడుద్దాం – ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి మౌలాన ముజాహిత్ ఖాన్ ఉమ్రి 2లో

పీసీసీ ఉపాధ్యక్షులుగా షేక్ నజీర్ అహ్మద్ 2లో

ఇస్లామి హింద్ రాష్ట్ర కార్యదర్శి మౌలాన ముజాహిద్ ఖాన్ ఉమ్రి

# అక్రమ కేసులు తప్ప అభివృద్ధి శూన్యం

### చంద్రబాబు అరెస్టుపై అన్యాయం : మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి



**మదనపల్లె, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**

అక్రమ కేసులు తప్పా రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమంటూ మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి తెలిపారు. శనివారం అంగళ్ళు అల్లర్ల కేసుకు సంబంధించి మదనపల్లె డిఎస్‌పి కార్యాలయానికి ఆయన టిడిపి నాయకులతో కలసి విచ్చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి కేశప్పకు కేసుకు సంబంధించిన పూచికత్తు వివరాలను సమర్పించారు. అనంతరం ఆయన బయట విలేకర్లతో మాట్లాడుతూ అధికారాన్ని అడ్డంపెట్టుకొని ప్రభుత్వం అక్రమ కేసులకు పాల్పడుతోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్టు అక్రమం అన్నారు. కేసులపై ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి అభివృద్ధిపై లేదన్నారు. ఓటమి భయంతోనే అంగళ్ళు, పుంగనూరు ఘటనలకు పాల్పడి తిరిగి తెలుగుదేశం కార్యకర్తలపై కేసులు పెట్టారని తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంటు అంటూ అవినీతి జరగని దానిలో అవినీతి జరిగిందంటూ చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి రిమాండ్‌కు పంపడం దారుణమన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఇలాంటి దుషచర్యలకు పాల్పడితే రానున్న రోజుల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్‌చినబాబు, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్,గంటా నరహరిలు మాట్లాడుతూ రాజకీయ కక్షతోనే తమపైన కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే చంద్రబాబుకు బెయిల్ రావడం ఖాయమన్నారు. 2024 ఎన్నికల్లో వైకాపాకు బుద్దిచెప్పి టిడిపిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, ఆర్‌జెవెంకటేష్, పర్వీన్‌తాజ్, మోడెం సిద్దప్ప, నీలకంఠ, శీతప్ప, రాటకొండ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ఈ చలానాలు రద్దు చేయాలి

### ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

**మదనపల్లె, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**



ఆటో డ్రైవర్లకు ఈ చలానాలు రద్దు చేసి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. శనివారం ఆటోడ్రైవర్స్, వర్కర్స్ యూనియన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి వారిని ఆదుకోవాలని కోరారు. సమస్యలపై ఈనెల 18న రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఫిఎఫ్, ఈఎస్ఐ, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. డ్రైవర్లకు వాహన మిత్ర పేరుతో ఏడాదికి రూ.10వేలు ఇస్తూ మరో వైపు ఇన్సూరెన్స్, ఎఫ్‌సి, ఈ చలానాల పేరుతో డ్రైవర్ల నుంచి దోపిడి చేస్తున్నారన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అధ్యక్షులు సలీంబాషా మాట్లాడుతూ ఆటోలు నిలుపుకోవడానికి పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలని, ఏఐటియుసి రాష్ట్ర సమితి పిలుపు మేరకు జరిగే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లోకనాథ్, మగ్బూల్‌సాహెబ్, ఖాదర్‌వల్లీ, బావాజీ, మౌలాలి, శేఖర్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టణంలో ఈవాక్‌ఫర్ ప్రీడం ర్యాలీ

**మదనపల్లె, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**




పట్టణంలో శనివారం ఎ-21, మూమెంట్ ఇండియా వారి సౌజన్యంతో గ్రామజ్యోతి సొసైటి ఆధ్వర్యంలో ఈవాక్‌ఫర్ ప్రీడం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రముఖ న్యాయమూర్తి వేంకటేశ్వర్లు నాయక్, ఆర్డీఓ ఎంఎస్.మురళి, డిఎస్‌పి కేశప్ప, గ్రామ జ్యోతి సొసైటి డైరెక్టర్ సుబద్ర హాజరై పిల్లలకు అవగాహన కల్పిస్తూ మాట్లాడారు. జిఆర్‌టి స్కూల్ నందు బెంగుళూరు బస్టాండు, టౌన్ బ్యాంకు సర్కిల్, ఆర్టీసి బస్టాండు, జడ్పిహైస్కూల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం మేము నడిచే నడక, ఆశా, పునరుద్దరణ కోసం నడిచే ప్రతి అడుగులో బానిసత్వం లేని ప్రపంచ సాధ్యమే మానవ అక్రమ రవాణా జీవితాలను నాశనం చేస్తున్న స్వేచ్ఛకు అంతిమ గెలుపు ఉంటుందని ప్రతి ఒక్క అడుగుతో చేరుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌బాషా, వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి, వెలుగు సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, వన్‌టౌన్ ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బోరుమోటార్లకు స్మాట్ మీటర్లను వ్యతిరేకించండి

### సిపిఐ నాయకులు డిమాండ్



**మదనపల్లె, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**

రైతు బోరుమోటార్లకు స్మాట్ మీటర్ల బిగించడాన్ని వ్యతిరేకించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి మురళి తెలిపారు. శనివారం శ్రీక్రిష్ణ సర్కిల్ నందు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలపైన విద్యుత్ బారాన్ని తగ్గించాలని, పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. పేదలకు 200యూనిట్ల వరకు ఎస్‌సి, ఎస్‌టిలకు ఉచిత కరెంటు ఇస్తామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్‌సంస్కరణలో భాగంగా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ భాగం చేస్తున్నారని అందులోభాగంగానే మీటర్లు అమర్చేందుకు విధానాన్ని తీసుకొచ్చారన్నారు. ఉచిత విద్యుత్‌ను రైతులకు దూరం చేస్తూ రైతులను అన్ని విధాల తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వర్రి సురేష్‌కుమార్, మౌలాలిబాషా, లక్ష్మీదేవి, హరి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

# పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమావేశం

### పాఠశాలకు క్రీడావస్తువులు వితరణ

**మదనపల్లెక్రైం, ఆక్టోబర్ 14 ప్రభాతవార్త :**

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1976-77వ సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు శనివారం ఆత్మీయసమావేశం నిర్వహించారు. పాఠశాలలకు రూ.1.75లక్షల విలువ చేసే క్రీడా వస్తువులు, 150 కుర్చీలు, ఒక పొడియంను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుధాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 46 సంవత్సరాల తరువాత స్నేహితులందరూ కలుసుకోవటం సంతోషంగా వుందన్నారు. భవిష్యత్‌లో పాఠశాలకు ఎటువంటి మౌళిక వసతులు అవసరమైనా తమవంతు సాయం అందజేస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, సుశీలమ్మ, ఓబయ్య, శ్రీనివాసరావు, అనసూయమ్మ, గంగులరెడ్డి, రంగచారులు, పుల్లారెడ్డి, శాంతమ్మలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజెపిలో మహిళలకు అధిక ప్రాధాన్యత

### పార్టీని విమర్శించేవారిపై చర్యలు తప్పవు

**మదనపల్లెక్రైం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**

బిజెపి పార్టీలో కష్టపడి పనిచేసేవారికి పదవులు వర్తి సాయని, మహిళలకు అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని బిజెపి అన్నమయ్య జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్లం పల్లి ప్రశాంత్ అన్నారు. శని వారం ఆయన ప్రెస్‌క్లబ్‌లో వి లేకర్లతో మాట్లాడుతూ నిన్నటి దినం బిజెపి పార్టీలోని మహిళా నాయకురాలు ఒకరూ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, అన్నయమ్మ జిల్లా అధ్యక్షురాలుపై అధారాలు లేని విమర్శలు చేయటం తగదన్నారు. పార్టీలో మహిళలకు సముచిత స్థానం కల్పించలేదని అమె విమర్శిం చటం హాస్యాస్పదం అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షురాలు ఒక మహిళ అని గుర్తించాలన్నారు. పార్టీలో వుంటూ పార్టీ నాయకులపై విమర్శలు చేసేవారిపై చర్యలు వుంటాయని ఆయన హెచ్చరించారు. డబ్బు వున్న వారికే బిజెపిలో పదవులు అంటూ మహిళా నాయకురాలు చేసిన విమర్శలను పార్టీలోని సీనియర్ నాయకులందరూ ముక్తకంఠంతో ఖండించారు. డబ్బు, గొప్ప, పేద అనే భేదం లేకుండా పార్టీలో క్రమశిక్షణతో పనిచేసేవారికి మాత్రమే పదవులు వుంటాయన్నారు. 2006వ సంవత్సరం నుంచి బిజెపిలో పనిచేస్తున్న తన పనితీరును గమ నించి పార్టీ పదవి ఇవ్వటం జరిగిందన్నారు. తనపై వ్యక్తిగత విమర్శలు చేసిన మహిళా నాయకురాలు బహిరంగ క్షమాపణ చెప్పకుంటే, లీగల్ నోటీస్ పంపటం జరుగుతుందన్నారు. మహిళా నాయకురాలి విమర్శలను పార్టీ సీనియర్ నాయకులు ఆకుల క్రిష్ణమూర్తి, వర్మ, పిల్లస్వామినాయక్, అజంతుల్లాఖాన్, వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, బాలు తదితరులు ఖండించారు.

# భక్తులతో కిటకిటలాడిన శనేశ్వరాలయం

**రామసముద్రం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**



మండలం కేంద్రంలో వెలసిన శనేశ్వరస్వామి మహాలయ అమావాస్య రోజున ఉదయంస్వామికి అభిషేకాలు, పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. స్వామికి పలురకాల పుష్పాలతో అలంకరణ చేశారు. స్వామిదర్శనార్థం వచ్చిన భక్తులకు మహామంగళహారతి ఇచ్చి భక్తులకు దర్శనభాగ్యం కల్పించి భక్తులకు పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# వావ్ ఇదేమి చెట్టు...వింత-చింత చెట్టు

**రామసముద్రం, అక్టోబర్ 14 ప్రభాతవార్త :**



చింతచెట్టు సాధారణంగా ఎక్కడ ఉన్నా ఒకే రకంగా ఉంటాయి. కిందనుండి 10నుండి 15 అడుగుల వరకు మొదలు ఉండి ఆ తరువాత కొమ్మలు ఉంటాయి. పెద్దగా ఉన్న చెట్టును ఎక్కాలంటే కిందకు ఆనుకొని ఉన్న కొమ్మల ద్వారా చెట్టు ఎక్కి చింతకాయలు కోస్తారు. చిత్రంలోని చింతచెట్టు మొదలు వింతగా ఉంది. రామసముద్రం పరిధిలోని చెంబకూరు రోడ్డులో ఉన్న ఓ చింతచెట్టు మర్రి చెట్టుకు ఉన్న ఊడల్లాగా పెరిగింది. చెట్టు మద్యలో రంద్రాలు ఉండడం, అక్కడక్కడా తొర్రలుగా విచిత్రంగా ఉంటుంది. ఈ చెట్టుకు 70ఏళ్ళకు పైగా వయస్సు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. చెట్టు కూడా చాలా పెద్దదిగా ఉండి ప్రజలకు నీడను ఇస్తోంది.

# చంద్రబాబు అరెస్టుపై కొవ్వుత్తులతో ర్యాలీ

### మాజీఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్

**మదనపల్లె, అక్టోబర్ 14 ప్రభాతవార్త:**

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ శనివారం మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు కలసి కొవ్వుత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడతూ ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవస్థలను అడ్డుపెట్టుకొని చంద్రబాబుపై అక్రమకేసులతో రాజకీయ కక్ష సాధిస్తున్నారన్నారు. ఇన్నిరోజులు శాంతియుతంగా నిరసనలు చేపట్టాం, ఇక నుంచి న్యాయం కోసం ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టి ప్రతిపౌరుని వద్దకు వెళ్ళిగతంలో చంద్రబాబునాయుడు చేసిన గొప్పతనం, స్కిల్ డెవలఫ్‌మెంటు ద్వారా యువత పొందిన లబ్ది వివరించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కొవ్వుత్తుల ర్యాలీ నిర్వహించి సైకోపోవాలి, సైకిల్ రావాలి అన్న నినాదంతో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువనాయకులు దొమ్మలపాటి యశ్విరాజ్, మున్సిపల్ వైస్‌ఛైర్మెన్ భవానిప్రసాద్, మేస్త్రీ రెడ్డెప్ప, అమ్మచెరువుమిట్ట నాయుడు, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, జయమ్మ, ఎస్ఎం.రఫి తదితరులు పాల్గొన్నారు.

# కడప జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌గా మదీనా దస్తగిరి ఎన్నిక



**వేంపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త :**

మైదుకూరుకు చెందిన వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు మదీనా దస్తగిరి కడప జిల్లా వక్ఫ్‌బోర్డు ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం కడపలో దస్తగిరి ప్రమాణ స్వీకారం చేశారు. వేంపల్లె, పక్కీరుపల్లెకు చెందిన సీనియర్ నాయకులు, మాజీ వార్డు మెంబరు ఖదీరుల్లాను కడప జిల్లా వక్ఫ్‌బోర్డు మెంబరుగా నియమించారు. తమకు వక్ఫ్‌బోర్డులో అవకాశం ఇచ్చినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. వక్ఫ్ ఆస్తులను కాపాడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రహంతుల్లా ఖాన్, పక్కీరుపల్లె బూత్ మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ



**పీలేరు, అక్టోబరు 14 ప్రభాతవార్తః**

స్థానిక డిపో ఆవరణలో డిపో మేనేజరు బండ్లకుమార్‌ఆధ్వర్యంలో శనివారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. ఈసందర్భంగా డిపో మేనేజరు మాట్లాడుతూ సెప్టెంబరు నెలలో అత్యధిక సాధించిన విల్ నాయుడు రూ.500 నగదు బహుమతి, పీపీ రెడ్డికి రూ.300 నగదు బహుమతి అందజేశారు. డ్రైవర్లు అందరూ వీరిని ఆదర్శంగా తీసుకుని ఇంధన పొదుపు సాధించాలని కోరారు. అలాగే టైర్ సంరక్షణ పక్షోత్సవాలులో భాగంగా అన్ని బస్సులకు గాలిని తనికీచేసి మెకానికల్ డిఫెక్షన్ గుర్తించి తగిన మరమ్మతులు చేయాలని తద్వారా టైరు మైలేజీ ని పెంచాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్యారేజీ ఇన్‌చార్జి హరినాథరెడ్డి, జనార్ధన డ్రైవరు సోదరులు కార్మికులందరూ హాజరైనారు.

# గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలి

### ఏఐటీయూసీ డిమాండు



**కేవి.పల్లె, అక్టోబరు 14 ప్రభాతవార్తః**

మండలంలోని నూతనకాలువ పంచాయతీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న సంవత్సరకాలం పాటు వేతనాలు తక్షణమే చెల్లించి వారి కుటుంబాలను ఆదుకోవాలని ఏఐటీయూసీ పీలేరు నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. శనివారం గ్రీన్ అంబాసిడర్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ కార్మికులు నెలనెలా వేతనాలు అందక కార్మిక కుటుంబాలు అనేక ఇబ్బందులు పడుతున్నారని జీతాలు అడిగితే మిమ్మల్ని పనులో నుంచి తొలగిస్తాం అంటూ ప్రజా ప్రతినిధులు అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని ఇలాంటివి మానుకోవాలని పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, యల్లయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# తంబళ్లపల్లెలో వాక్ ఫర్ ప్రీడం ర్యాలీ



**తంబళ్లపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండల కేంద్రంలో ఏ 21 మరియు మూమెంట్ ఇండియా వారి సహకారంతో గ్రామ జ్యోతి సొసైటీ సూచన మేరకు హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ ప్రీడం ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని తంబళ్లపల్లె పోలీసు స్టేషన్ ఎస్సై రెడ్డప్ప నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అరికట్టడానికి హెల్పింగ్ మైండ్స్ యువత చేస్తున్న కృషి ఆదర్శనీయమని తెలిపారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ బానిసత్వం లేని ప్రపంచం సాధ్యమేనని మానవ అక్రమ రవాణా జీవితాలను నాశనం చేస్తున్నా స్వేచ్ఛకు అంతిమ గెలుపు ఉంటుందని ఆ ఒక్క అడుగుతోనే బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ ర్యాలీలో హెల్పింగ్ మైండ్ సభ్యులు సిరాజ్, తుపాకుల శివ, నాగేంద్ర, పురుషోత్తం, సాకే ప్రవీణ్, కల్యాణ్, భవదీష్, లోకేష్, స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

# రెండు పదవుల్లో కొనసాగలేను

### బిజెపి అసెంబ్లి ఇన్‌ఛార్జి గడ్డం చెంగల్‌రాజు

**రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త**

రైతు విభాగం కిసాన్‌మోర్చ అధ్యక్షులు కుమారస్వామి ఇటీవల రైల్వేకోడూరు నియోజకవర్గానికి చెందిన హార్టికల్చర్ సెల్ కన్వీనర్‌గా గడ్డం చెంగల్‌రాజును నియమించడం సరైనది కాదని, గతంలో రైల్వేకోడూరు అసెంబ్లికన్వీనర్‌గా ఎంపికైన సందర్భంలో మరలా రెండో పదవి ఇవ్వడం అత్యంత బాధాకరమైన విషయమని దయతో ఒక పదవికి న్యాయం చేయగలనని, రెండో పదవిని చేపట్టలేనని విలేకరుల వద్ద చెంగల్‌రాజు అన్నారు. రాష్ట్రంలో బిజెపి చేపట్టే ప్రతి సంక్షేమ పథకాన్ని అన్నివర్గాలకు చేర్చే బాధ్యతగా పనిచేస్తున్నానని, గౌరవ ప్రధాని నరేంద్రమోడి, అమిత్‌షా దేశానికి చేస్తున్న సేవలను ప్రతిగడపకు చేర్చగలనని, తనకు ఒక పదవి మాత్రమే చాలని రెండో పదవిలో కొనసాగలేనని చెంగల్‌రాజు విలేకరుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో ఎప్పటికైనా భారతీయ జనతాపార్టీ ఏలేరోజులు దగ్గరలో ఉన్నాయని తన విన్నపాన్ని కేంద్రం, రాష్ట్ర అధిష్టానం గుర్తించి న్యాయం చేయాలని ఆయన విలేకరుల వద్ద విన్నవించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా బిజెపి నాయకులు వాకచర్ల సుబ్బారావు, మాజీ మార్కెట్‌కమిటి ఛైర్మన్ జయప్రకాష్ నారాయణవర్మ, జోగినేని సుబ్బారావు, శంకర్‌రాజు, చలపతి, గడికోట సోమశేఖర్, ఎలిశెట్టి సాంబ, వాకచర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# శివారెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ



**పీలేరు, అక్టోబరు 14 ప్రభాతవార్తః**

కలికిరి మండలంలోని గుట్టపాలెం పంచాయతీ కంభంవారిపల్లెకు చెందిన మాజీ సర్పంచి కంభం శివారెడ్డి మరణించిన విషయం తెలుసుకుని వారి కుటుంబ సభ్యులను తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి కలికిరి సర్పంచి రెడ్డివారి ప్రతాప్‌రెడ్డి, గుట్టపాలెం మాజీ సర్పంచి కెవి.రెడ్డి తదితరులు ఉన్నారు.

# నేటి నుంచి చీనేపల్లెలో శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాలు

**కేవి.పల్లె, అక్టోబరు 14 ప్రభాతవార్తః**

మండలంలోని ఎంవి.పల్లె పంచాయతీ చీనేపల్లెలో వెలసిన శ్రీరామ లింగ చౌడేశ్వరిదేవి శరన్నవరాత్రులు ఉత్సవాలు నిర్వహించబడునని ఆలయ అర్చకులు వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం కలశ స్థాపనతో అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్రతి రోజు అమ్మవారికి దశనామములతో ఒక్కొక్క రోజు ఒక్కో నామంతో అమ్మవారిని అలంకరించి ఉభయదారులు గోత్ర నామాలతో పూజలు జరుపబడునని తెలిపారు. 22న దుర్గాహోమంతో పాటు రాత్రి శ్రీరాములవారి ఉరేగింపు 23న అన్నమాచార్య కీర్తనలు భజనలు తిరుపతి బందంచే నిర్వహించబడునన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం హర్షణీయం



**వేంపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త :**

కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులుగా గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా షేక్ అల్లాబకాష్‌లను నియమించడం హర్షణీయమని వేంపల్లె కాంగ్రెస్ నాయకులు అభినందలు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు, షేక్ నజీర్ అహమ్మద్ బండి జకరయ్య, ప్రభాకర్‌లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా సత్తార్, చంద్రశేఖర్‌రెడ్డి లీలా శ్రీనివాస్‌లకు నియమించడం పట్ల వారు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తులసిరెడ్డి నాయకత్వంలో కడప, అన్నమయ్య జిల్లాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు బోరెడ్డి నరసింహారెడ్డి, బద్రి, ఉత్తన్న, రాఘవయ్య, సుబ్బరాయుడు వినయ్, తదితరులు పాల్గొన్నారు.

# నూర్‌బాష్, దూదేకుల ముస్లీంల సింహగర్జన

### ఛలో గుంటూరు జయప్రదం చేయండి



**పీలేరు, ఆక్టోబరు 14 ప్రభాతవార్తః**

గుంటూరులో ఈనెల 29న ఆంధ్రప్రదేశ్ నూర్‌బాష్ దూదేకుల ముస్లీం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఇందాదుల్లా పిలుపునిచ్చారు. రాష్ట్ర జనాభాలో ఏడు శాతం ఉన్న నూర్‌బాష్ ముస్లీం సంక్షేమానికి అన్ని రంగాల్లో హక్కులు కల్పించాలని ప్రభుత్వాలు మారినా, తరాలు మారినా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నామన్నారు. రాష్ట్రంలో రెండు, మూడు శాతం ఉన్న వారు కూడా చట్ట సభల్లో ఉండి రాజకీయాల్లో చలామణి అవుతున్నారని 30లక్షలకు పైగా జనాభా ఉన్న మాకు ఏ రాజకీయ పార్టీ అవకాశం కల్పిస్తే ఆపార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తామని తెలిపారు.స్థానికంగా తమ నివాసంలో ప్రెస్‌మీట్ ఏర్పాటుచేసి మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఈనెల 29న గుంటూరులో ఆంధ్ర ముస్లీం కాలేజ్‌లో సింహగర్జన బహిరంగ సభను ఏర్పాటుచేయడం జరిగిందని దీనికి సంబంధించిన కరపత్రాలు విడుదచేయడం జరిగింది. ఈకార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులేశు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ షఫీ అలాగే అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఇమామ్‌లు, కార్యదర్శి అమీర్‌బాష, రాయచోటి ప్రెసిడెంట్ ఖాదర్, ఫజులుల్లా, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఫజులుల్లా డైరెక్టర్ జిల్లా వర్కు బోర్డు నాయకులు రామ్ తుల్లా మస్తాన్ హుస్సేన్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి

### – మార్కెట్ యార్డ్ ఛైర్మన్ విశ్వనాథరెడ్డి, రమేష్‌రెడ్డి



**రామాపురం, అక్టోబరు 14, ప్రభాతవార్త:**

హిందూ సనాతన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలని లక్కిరెడ్డిపల్లె మార్కెట్ యార్డు ఛైర్మన్ విశ్వనాథరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ రమేష్‌రెడ్డి, సర్పంచ్ నాగభూషణరెడ్డిలు పేర్కొన్నారు. మండల కేంద్రమైన రామాపురంలోని హరిహరాలయం వద్ద శనివారం విశ్వహిందూ పరిషత్ శౌర్య జాగరణ రథయాత్రను వారు ప్రారంభించారు. మూడు రోడ్ల కూడలి హరిహరాలయం వరకు రథాన్ని ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ చెక్క భజన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు వెంకటరమణ, సొసైటీ అధ్యక్షులు పెద్దిరెడ్డి ఆదినారాయణరెడ్డి, అంజనారెడ్డి, వీరారెడ్డి, కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, దామోదర్ నాయుడు, ప్రసాద్‌రెడ్డి, క్వారీ భాస్కరరెడ్డి, వీహెచ్‌బీ నేతలు, భజన బృందం సభ్యులు పాల్గొన్నారు.

# పండుగ వాతావారణంలో మైనారిటీ దినోత్సవం

### రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్

**పీలేరు, అక్టోబరు 14 ప్రభాతవార్తః**



జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని మంగళగిరిలో జరిగిన రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఏటా భారతదేశ తొలివిద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర సమరయోధులు అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ మైనారిటీ సంక్షేమ దినోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఈఏడాది నవంబరు 11న రాష్ట్రంలోని ఒక చోట రాష్ట్రస్థాయిలోనూ 26 జిల్లాల్లో ఈకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించి వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులు, రచయితలు, కవులు, ఉపాధ్యాయులు, విద్యార్థులకు అవార్డులను ప్రధానం చేయనున్నట్లు తెలిపారు. ఈఏడాది రాష్ట్ర స్థాయిలో రూ.17లక్షలతో 166 మంది కి అవార్డులను అందజేసేందుకు కార్యాచరణను రూపొందించామన్నారు. వీటిలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ అవార్డు కింద ఒకరికి రూ.1.25లక్షల నగదు పారితోషికం, డాక్టర్ అబ్దుల్ హక్ అవార్డు కింద ఒకరికి రూ.లక్ష పారితోషికాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అలాగే రూ.25 వేలు చొప్పున 8 మందికి జీవిత సాఫల్య పురస్కారాలను 78 మంది ఉపాధ్యాయులకు రూ.10వేలు చొప్పున మరో 78 మందికి ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున రాష్ట్రస్థాయి పురస్కారాలను ఇవ్వడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ ఛైర్మన్లు, మైనారిటీ వర్గానికి చెందిన మేధావులు, ఉన్నతాదికారులు పాల్గొంటారని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మైనారిటీల పక్షపాతిగా పనిచేస్తున్నారని పరిపాలనలో మైనారిటీల పక్షపాతిగా పనిచేస్తున్నారని పరిపాలనలో మైనారిటీలకు ప్రత్యేక గౌరవం సముచిత స్థానాన్ని కల్పించారన్నారు. రాయలసీమ జిల్లాలోనూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి మైనారిటీలను తమ కుటుంబ సభ్యులుగా పరిగణిస్తూ రాజకీయంగా, సామాజికంగా వారి అభివద్ధి కోసం చేయూతనిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలోని ఉర్దూ అకాడమి ఉద్యోగుల వేతనాలను పెంచేందుకు కూడా పాలకవర్గ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపాల్ సెక్రటరీ ఎండీ ఇంతియాజ్ సమావేశానికి అధ్యక్షత వహించగా రాష్ట్ర ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ శ్రీనివాసులు, ఉర్దూ అకాడమి డైరెక్టర్ సెక్రటరీ మస్తాన్‌వలి, రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్ సెక్రటరీ మస్తాన్‌వలి రాష్ట్ర ఉర్దూ అకాడమి డైరెక్టర్లు షుకూర్‌సాహెబ్, నూరుల్లా ఖాదరి సాహెబ్, దిల్దాద్ నజరానా తదితరులు పాల్గొన్నట్లు తెలిపారు.

## 8వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

పెండ్లిమర్రి, అక్టోబరు 14, ప్రభాతవార్త:



వెల్లటూరు గ్రామ పొలిమేరలో వెలసిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మ తల్లి అమ్మవారి దేవస్థానంలో ఆదివారం నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రలు కాగలరని ఆలయ కమిటీ సభ్యులు, వెల్లటూరు గ్రామ ప్రజలు తెలిపారు.

## చంద్రబాబు ఆరోగ్యం,విడుదల పట్ల ప్రత్యేక పూజలు



కడప వైద్యవిభాగం, అక్టోబరు 14, ప్రభాతవార్త:

మాజీ సీఎం, తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జైలు నుంచి విడుదల కావాలని అలాగే ఆయన ఆరోగ్యం బాగుండాలని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో తెదేపా నాయకులు వి.ఎస్.అమీర్‌బాబు, ఆలంఖాన్‌పల్లె లక్ష్మిరెడ్డి, దుర్గాప్రసాద్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు జైలు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని సీఎం అయిన తరువాత ప్రజా పాలన అన్ని రంగాల్లో ఉన్న వారు అభివృద్ధి చెందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆలంకాన్‌పల్లె సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు మన్మోహన్‌రెడ్డి, తెదేపా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, నగర తెలుగు యువత అధ్యక్షులు మేకల వెంకటేష్ యాదవ్ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి నజీర్ అహ్మద్, సిటీ నగర అధ్యక్షులు కొండా సుబ్బయ్య, పాలకొండ దేవస్థానం మాజీ ఛైర్మన్ ఓబుల్‌రెడ్డి, ఆలంఖాన్‌పల్లె, మాజీ ఛైర్మన్ ఓబుల్‌రెడ్డి, ఆలంఖాన్ మాజీ వార్డుమెంబర్ జయరాంరెడ్డి, నగర సిటీ ఉపాధ్యక్షులు మరియు ప్రముఖ న్యాయవాది లింగాల శివశంకర్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి కోవెలకుంట్ల శ్రీనివాసులు, 36వ డివిజన్ ఇన్‌ఛార్జి ఆదిల్, నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఇమ్రాన్ కార్యదర్శి నాసర్ అలీ, మహిళా నాయకురాలు, కడప నగర మహిళా మాజీ అధ్యక్షురాలు చిప్పగిరి మీనాక్షి అరుణ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం హర్షణీయం



వేంపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త :

కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షులుగా గుండ్లకుంట శ్రీరాములు, అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా షేక్ అల్లాబకాష్‌లను నియమించడం హర్షణీయమని వేంపల్లె కాంగ్రెస్ నాయకులు అభినందలు తెలిపారు. అదే విధంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీరాములు, షేక్ నజీర్ అహమ్మద్ బండి జకరయ్య, ప్రభాకర్‌లను రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా సత్తార్, చంద్రశేఖర్‌రెడ్డి లీలా శ్రీనివాస్‌లకు నియమించడం పట్ల వారు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తులసిరెడ్డి నాయకత్వంలో కడప, అన్నమయ్య జిల్లాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు బోరెడ్డి నరసింహారెడ్డి, బద్రి, ఉత్తన్న, రాఘవయ్య, సుబ్బరాయుడు వినయ్, తదితరులు పాల్గొన్నారు.

## చంద్రబాబు ఆరోగ్యం పట్ల వ్యక్తిగత వైద్యుడిని అనుమతించాలి

వేంపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త :



చంద్రబాబుకు 42ఏళ్ల రాజకీయ చరిత్ర ఉందని, 14ఏళ్ల పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉన్నప్పటికీ ఎటువంటి అవినీతి కానీ అన్యాయం కానీ చేయలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎనలేని కృషి చేశారని కడప జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేదర వికుమార్ అన్నారు. ప్రస్తుతం స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కేసులో ఎటువంటి ఆధారాలు చూపకుండా చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో 35రోజులుగా ఉంచారన్నారు. ఆయన జైలులో ఉన్నప్పటికీ కూడా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసమే పరితపిస్తున్నారన్నారు. ఇప్పుడు చంద్రబాబుకు జైలులో డీహైడ్రేషన్, స్కిన్ అలర్జీతో ఆయన అస్వస్థకు గురయ్యాడన్నారు. ఆయన ఇప్పటికే ఐదు కిలోల బరువు తగ్గారని, మరింత తగ్గితే అనారోగ్య సమస్యలు వస్తాయన్నారు. చంద్రబాబుపై వైకాపా ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేయకుండా ఆయన ఆరోగ్యం దృష్ట్యా పోలీసులు, ఉన్నతాధికారులు స్పందించి చంద్రబాబును వెంటనే సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో కనీస వైద్య సౌకర్యాలు కల్పించాలని, అలాగే జైలులోకి చంద్రబాబు వ్యక్తిగత వైద్యుడిని అనుమతించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున తెదేపా కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, నాయకులు, అభిమానులు కలిసి వ్యక్తిగత వైద్యుడిని పంపించేత వరకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు వద్ద పెద్దఎత్తున ధర్నాకు దిగి చంద్రబాబును కాపాడుకుంటామని మేదర రవికుమార్ తెలిపారు.

## డా.గునిశెట్టికి ప్రధాని ప్రశంసలు

పెండ్లిమర్రి, అక్టోబరు 14, ప్రభాతవార్త:



విద్యాశాఖ రీసోర్స్ పర్సన్‌గా డా.గునిశెట్టి శ్రీనివాసులుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ కార్యాలయం నుంచి ప్రశంసలు లభించాయి. విద్యార్థులకు పరీక్షలపై అవగాహన భయం లేకుండా రాయడం లాంటి విషయాలపై పరీక్షా పే చర్చా - 2023 కార్యక్రమంలో ప్రధాని విద్యార్థులతో ముఖాముఖి చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో అనుభవజ్ఞులు, నిపుణులు ప్రధాని కార్యాలయం నుంచి వ్యక్తిగతంగా రిజిష్టర్డు పోస్ట్ ద్వారా ప్రశంసా పత్రం అందుకున్నారు. ఈయన పెండ్లిమర్రి మండలం ఎగువపల్లి జడ్పీ హైస్కూల్లో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. గతంలో ఈయనకు 2021-22 బడ్జెట్‌పై సూచనలు ఇచ్చినందుకు కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ నుంచి కూడా ప్రశంసలు అందుకున్నారు. దీనిపై పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు, పుర ప్రముఖులు ఆయనను అభినందించారు.

## రేపు గుడిపాడులో వైద్యశిబిరం

దువ్వూరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గుడిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డా.షమీరా తెలిపారు. ఈ వైద్య శిబిరంలో మండలానికి చెందిన వైద్యులే కాకుండా కడప నుంచి నలుగురు వివిధ విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు వస్తున్నారని ఈ వైద్యశిబిరాన్ని గుడిపాడు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



వేంపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త :

కృష్ణజలాల పున: పంపిణీని వ్యతిరేకిస్తూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో కడపలో ఈనెల 18న జరగనున్న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ రాజ్యసభ సభ్యులు డాక్టర్ ఎన్.తులసిరెడ్డి, సీపీఐ నాయకులు వెంకటరాములు పిలుపునిచ్చారు. రాష్ట్ర సదస్సు గోడపత్రాలను శనివారం వేంపల్లెలో ఆవిష్కరించారు. కృష్ణాజలాల పున:పంపిణీతో రాష్ట్రానికి జరగబోయే అన్యాయం గురించి వివరించారు. ఈనెల 18న కడపలోని వైఎస్ఆర్ ఆడిటోరియంలో జరగబోయే రాష్ట్ర సదస్సులో అందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహారెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, సీపీఐ నాయకులు, సీపీఐ పులివెందుల ఏరియా సహాయ కార్యదర్శి కొత్తకాలువ బ్రహ్మం, వేంపల్లె నాయకులు బత్తల మల్లేష్, అంజనప్ప పాల్గొన్నారు.

## చంద్రబాబు ఆరోగ్యం మెరుగుపడాలని గుండ్లూరు శివాలయంలో పూజలు

రాజంపేట అర్బన్, అక్టోబరు 14 ప్రభాతవార్త

తెలుగుదేశంపార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ గుండ్లూరు శివాలయంలో పూజలు నిర్వహించారు. మోకాటిపై కూర్చొని స్వామికి మొక్కులు చెల్లించారు. జగన్‌సర్కార్ అరాచక పాలనతో పాటు ప్రతిపక్ష నేతల ఆరోగ్య విషయంలో పైశాచిక ఆనందం పొందుతూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరి మారకపోతే రాజమండ్రి జైలును ముట్టడిస్తామని టిఎన్ఎస్ఎఫ్ నేత హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నేతలు నరేంద్ర, యానాది, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేడు చిట్వేలిలో ఉచిత కంటివైద్య శిబిరం

కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య

చిట్వేలి, అక్టోబరు 14 ప్రభాతవార్త



చిట్వేలి గ్రామ పరిధిలోని శ్రీసాయి వికాస్ పాఠశాలలో తిరుపతి సురేంద్ర కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో డాక్టర్ సురేంద్ర పర్యవేక్షణలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నేడు ఉదయం 9 గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహిస్తున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ తిరుమల రెడ్డయ్య తెలియపరిచారు. కంటి సంబంధిత వ్యాధులు కంటి శుక్లాల ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తు న్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆపరేషన్లు చేయించుకోవాలనుకున్నవారు ఒరిజన ల్ ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, బ్యాంకు అకౌంట్‌ను తప్పనిసరిగా తీసుకురావా లన్నారు. ఎంపికైనవారికి రవాణా ఖర్చులతో పాటు పూర్తిగా ఉచితంగా కంటి ఆపరేషన్ నిర్వహిస్తామన్నారు. మండల పరిధిలోని ప్రజలందరూ ఈ సదవకాశా న్ని ఉపయోగించుకోవాలని కరస్పాండెంట్ రెడ్డయ్య విజ్ఞప్తి చేశారు.

## అప్కాస్ డైరెక్టర్‌ను ఘనంగా సత్కరించిన బలిజ సంఘం నాయకులు



బద్వేల్, అక్టోబరు 14, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా నియమితులైన డాక్టర్ సత్యమును బద్వేల్ బలిజ సంఘం నాయకులు ఘనంగా సత్కరించారు. పోరుమామిళ్లకి చెందిన డాక్టర్ సత్యం ప్రజా సేవలో నిమగ్నమై అందరి మన్నను పొందడమే కాకుండా పార్టీ కోసం అహర్నిశలు పనిచేశారు. పార్టీ గుర్తించి ఆంధ్రప్రదేశ్ ఔట్సోర్సింగ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా( ఆప్కాస్) పదవి ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బద్వేల్ బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు డివి దద్దం వెంకటేశ్వర్లు ,ప్రధాన కార్యదర్శి కొర్రపాటి సురేంద్ర, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య ,గుర్రాల హరికృష్ణ ,బాషికల శ్రీనివాసులు, పెద్ది సుధాకర్ ,పండుగల శ్రీనివాసులు, చిన్ని సుబ్బారావు ,గోగు రామయ్య ,గాజుల వంశి ,వెంకటేష్ ఇంకా కొంతమంది సభ్యులు అందరూ కలిసి సంఘం తరపున సన్మానం చేయడం జరిగింది.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దువ్వూరు, అక్టోబరు 14, ప్రభాతవార్త:

మండల పరిధిలోని కడప - కర్నూలు జాతీయ రహదారిపై రామాపురం మిట్ట సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో డిరాజశేఖర్(26) అనే యువకుడు మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన రాజశేఖర్ ఓ మెడికల్ ఏజెన్సీలో పనిచేస్తు కడపలో ఉంటున్నాడు. శుక్రవారం ఏజెన్సీ పని నిమిత్తం జిల్లెల్ల నుంచి కడపకు వెళ్తుండగా రామాపురం మిట్ట సమీపంలో జాతీయ రహదారిపై ఓ జంతువు రాగా అదుపు తప్పి మోటారు సైకిల్ ఢీవైడర్‌ను ఢీకొంది. దీంతో రాజశేఖర్‌కు తీవ్ర గాయాలయ్యాయి అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించగా వైద్యుల సూచనల మేరకు కర్నూలు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మరణించాడు. కర్నూలు నందు దువ్వూరు పోలీసుల ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

## పారిశుద్ధ్యంలో రైల్వేకోడూరు భేష్

ఐఎస్ఒ సోనియాజోష్

రైల్వేకోడూరు రూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త

రైల్వేకోడూరు మండలంలో పారిశుద్ధ్య విషయంలో ఎంతో చక్కటి పారిశుద్ధ్యాన్ని కనబరుస్తున్నారని ఐఎస్ఒ సర్టిఫికెట్ కొరకు సోనియాజోష్ కోఆర్డినేటర్ కెఐఎల్ఎ, నాగరాజు, డివిజనల్ పంచాయతి అధికారి మదనపల్లె సంబంధిత అధికారులు రైల్వేకోడూరు పట్టణంలోని ఉపసర్పంచ్ తోట శివసాయి ఆధ్వర్యంలో పంచాయతి కార్యాలయాన్ని, పారిశుద్ధ్యాన్ని వారు పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం దీనిపై ప్రత్యేక దృష్టి ఉంచి ఐఎస్ఒ ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఆఫ్ స్టాండెట్స్ సర్టిఫికెట్ కొరకు వెరిఫికేషన్ కార్యక్రమాన్ని శనివారం కెఐఎల్ఎ వారు ప్రత్యేకంగా కోడూరు పంచాయతి కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సోనియాజోష్ మాట్లాడుతూ తాను పట్టణంలో ని ప్రధాన రహదారుల్లో, పలువీధుల్లో పర్యటించానని, అయితే దాదాపు అన్నివీధుల్లో పారిశుధ్య కార్మికుల ద్వారా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధు లు ఎంతో కష్టపడి పనిచేస్తున్నారని గమనించానని ఆమె అన్నారు. అదేవిధంగా ఐఎస్ఒ సర్టిఫికెట్ కొరకు అన్నమయ్య జిల్లాలో మొదట పీలేరు, రెండోది రైల్వేకోడూరు కావడం ఎంతో సంతోషంగా ఉందని, ఇక్కడ పనిచేస్తున్న ప్రజా ప్రతినిధులు శక్తివంచన లేకుండా పారిశుద్ధ్య విషయంలో నిరంతరంగా శ్రమిస్తు న్నారని సోనియాజోష్ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ తోట శివసాయి, సర్పంచ్ శివయ్య, ఇఒ వరప్రసాద్, శానిటరి ఇన్‌స్పెక్టర్ నౌషద్‌అలీ, అధికారులు రాజు, పంచాయతి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణించి జాతీయ స్థాయికి ఎదగాలి

– రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల ప్రారంభ కార్యక్రమంలో సీఈవో సాయిగ్రేస్



కడప కార్పొరేషన్, అక్టోబరు 14, ప్రభాతవార్త:

రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొనే క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో తమ ప్రతిభను ప్రదర్శించి జాతీయ స్థాయికి ఎదగాలని స్టెప్ సీఈవో సి.సాయిగ్రేస్ అన్నారు. కడప జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కడపలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ మైదానంలో రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఈవో మాట్లాడుతూ క్రీడా పోటీల్లో గెలుపోటములు సమానమన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే 13 జిల్లాలకు చెందిన బాలుర జట్లు, మహిళల జట్లు గెలుపే లక్ష్యంగా బరిలోకి దిగాలన్నారు. హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు లయన్ కె.చిన్నపరెడ్డి మాట్లాడుతూ కడపలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించడం చాలా సంతోషకరమైన విఘుయమన్నారు. 13 జిల్లాల నుంచి జూనియర్ బాలుర విభాగం, సీనియర్ మహిళల విభాగం జట్లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, స్పాన్సర్లు కంచి గోపీకృష్ణ, కంచి సురేంద్ర, రాజారత్నం ఐజాక్, రోడా మెర్సీ, కార్పొరేటర్ సూర్యనారాయణ, కిరణ్, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వీవీ శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి బసిరెడ్డి, కిశోర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట సునీల్, కార్యవర్గ సభ్యులు, అన్ని జట్ల మేనేజర్లు, కోచ్‌లు, అబ్జర్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## తంబళ్లపల్లెలో వాక్ ఫర్ ఫ్రీడం ర్యాలీ



తంబళ్లపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త:

తంబళ్లపల్లె మండల కేంద్రంలో ఏ 21 మరియు మూమెంట్ ఇండియా వారి సహకారంతో గ్రామ జ్యోతి సొసైటీ సూచన మేరకు హెల్పింగ్ మైండ్స్ ఆధ్వర్యంలో వాక్ ఫర్ ఫ్రీడం ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని తంబళ్లపల్లె పోలీసు స్టేషన్ ఎస్సై రెడ్డప్ప నాయక్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అరికట్టడానికి హెల్పింగ్ మైండ్స్ యువత చేస్తున్న కృషి ఆదర్శనీయమని తెలిపారు. హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకులు అబూబకర్ సిద్దిక్ మాట్లాడుతూ బానిసత్వం లేని ప్రపంచం సాధ్యమేనని మానవ అక్రమ రవాణా జీవితాలను నాశనం చేస్తున్నా స్వేచ్ఛకు అంతిమ గెలుపు ఉంటుందని ఆ ఒక్క అడుగుతోనే బాధితులకు అండగా నిలవాలని కోరారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ ర్యాలీలో హెల్పింగ్ మైండ్ సభ్యులు సిరాజ్, తుపాకుల శివ, నాగేంద్ర, పురుషోత్తం, సాకే ప్రవీణ్, కల్యాణ్, భవదీష్, లోకేష్, స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## వ్యక్తిగత విమర్శలు మానకుంటే.. తప్పదు మూల్యం

– కడప జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్

కడప కార్పొరేషన్, అక్టోబరు 14, ప్రభాతవార్త:



దోచుకుని దాచుకునేవారు రాష్ట్రాన్ని ఏలితే ఆ రాష్ట ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందో ఏపీని చూస్తే అర్థమవుతుందని కడప జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సుంకర శ్రీనివాస్ అన్నారు. పదేళ్లుగా బెయిల్‌పై ఉన్న ఏపీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాజ్యాంగాన్ని సైతం అపహాస్యం పాలు చేస్తున్నారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేక వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను సీఎం వైఎస్.జగన్ వ్యక్తిగతంగా విమర్శలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. జనసేనాని సంధిస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక మూడు పెళ్లిళ్ల గురించి మాట్లాడడం భావ్యం కాదన్నారు. ఇంకోసారి రిపీట్ అయితే జనసేన సైనికులు చూస్తూ ఊరుకోరని తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో విధిలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఇలాంటి పరిస్థితికి రాష్ట్ర ప్రభుత్వం కారణమన్నారు. ప్రజల దృష్టి మరల్చేందుకు ఎన్ని కుయుక్తులు, కుట్రలు చేసినా ప్రజాక్షేత్రంలో ప్రజలతో కలిసి మిమ్మల్ని సాగనంపే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యక్రమాల కమిటీ కార్యదర్శి సురేష్‌బాబు, మాజీ కడప జిల్లా జనసేన సేవాదల్ కోఆర్డినేటర్ పండ్రా రంజిత్ కుమార్, పి.వి.బోరెడ్డి నాగేంద్ర, స్వరూప్, గజ్జల సాయి, శేషు రాయల్, వినయ్, బాబునాయక్, కుమార్ నాయక్, సుధీర్ నాయక్, చార్లెస్ లోకేష్, పాల్గొన్నారు.

## వీరభద్రస్వామి ఆలయంలో దసరా ఉత్సవాలకు అంకురార్పణ



బద్వేల్, అక్టోబరు 14 ప్రభాతవార్త

శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవంలో భాగంగా శనివారం అంకురార్పణ చేపట్టారు. ఆదివారం నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం వచ్చిన నేపథ్యంలో ఆలయం నిర్వాహకులు ఉత్సవాల సంబంధించి పుస్తక ఆవిష్కరించారు. ఆలయ శాశ్వత ధర్మకర్త పొద్దుటూరు కిషోర్ కుమార్, అధ్యక్షులు దేవత సురేంద్ర, వైస్ ప్రెసిడెంట్ వడ్లపూడి నాగభూషణం, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రెసిడెంట్ ఓబుల శెట్టి చిన్న సుబ్బరాయుడు, సెక్రటరీ ఇమిడి సెట్టి సత్యనారాయణ, జాయింట్ సెక్రెటరీ చిప్పగిరి ఆంజనేయులు, జాయింట్ సెక్రెటరీ దేవత వెంకట సుధాకర్, ట్రెజరర్ దేవతి పెద్ద మల్లికార్జున మరియు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలకు అంకురార్పణ చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈసారి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తీర్మానించడం జరిగిందన్నారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో చేపట్టాలని నిర్ణయించామన్నారు, ముఖ్యంగా విజయదశమి రోజున గ్రామోత్సవం వెంట తెనాలి మ్యూజికల్ బ్యాండ్ వారిచే ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ వారం నుంచి ప్రారంభమైన ఉత్సవాలు చివరి వరకు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు వీరభద్ర స్వామి దేవస్థానం కమిటీ నిర్ణయం తీసుకున్నదని పేర్కొన్నారు.

## నేటి నుంచి వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు

– దసరా ఉత్సవాలకు చలువపందిళ్లు, విద్యుత్తుదీపాలతో ముస్తాబైన ఆలయాలు



బద్వేలు అర్బన్, అక్టోబరు 14, ప్రభాతవార్త:

శ్రీ మత్యన్యకా పరమేశ్వరి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు నేటి నుంచి ఈనెల 24వ తేదీ మంగళవారం వరకు బద్వేలు పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిశాలలో అంరగంగ వైభవంగా నిర్వహించేందుకు ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కేవీ సుబ్బారావు, సెక్రటరీ నాగరాజా, కోశాధికారి చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీలు సగలా సురేష్‌బాబు, వైభవ్ ప్రసాద్, వైస్‌ప్రెసిడెంట్లు మునగా చలమయ్య, దర్శి వెంకటేశ్వర్లుతో పాట పలువురు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా సిద్ధం చేసినట్లు తెలిపారు. దసరా ఉత్సవాలకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ముందస్తుగా చలువ పందిళ్లు విద్యుత్తు దీపాలతో పాటు పలు రకాల ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. దసరా ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు గణపతి హోమం, రుద్రహోమం, లక్ష్మీ హోమంతో పాటు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సాయంత్రం జగత్‌జనని దేవి అమ్మవారి అలంకారం 16న శ్రీరాజరాజేశ్వరి దేవి, 17న శ్రీ దుర్గాదేవి, 18న శ్రీఅన్నపూర్ణాదేవి, 19న శ్రీ బిల్వవృక్ష వాసవీదేవి జగన్‌మోహిని (తోటోత్సవం) అమ్మవారు 20న సరస్వతిదేవి, 21న పార్వతీ దేవి, 22న శ్రీ మహిషాసురమర్ధినీ దేవి, 23న శ్రీవిజయలక్ష్మీదేవి అలంకారం, సాయంత్రం శమిదర్శనం, 24న చివరి రోజు శ్రీకన్యకాపరమేశ్వరి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. మహోత్సవాలు ఆర్యవైశ్యులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని వారు కోరారు. మహాలక్ష్మి, శ్రీభద్రకాళి ఆలయం, శ్రీకోదండరామాలయంలో దసరా ఉత్సవాలు నేటి నుంచి 24 వరకు నిర్వహించనున్నట్లు ఆయా దేవాలయాల కమిటీ సభ్యులు తెలిపారు. పట్టణంలోని పలువురు ఆర్యవైశ్యులందరూ దసరా ఉత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

## కమిటీని సత్కరించి



బద్వేలు అర్బన్, అక్టోబరు 14, ప్రభాతవార్త:

కడప జిల్లా వక్ఫ్‌బోర్డు కమిటీ అధ్యక్షులు మదినా దస్తగిరి, వక్స్ బోర్డు డైరెక్టర్ సేక్ మహ్మద్ ఉమ్మర్‌లను కడప నగరంలో శనివారం నిర్వహించిన ప్రమాణ స్వీకారంలో ఎల్ఐసీ డీసీ గోవిందరెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి, ఏపీ సివిల్ సప్లయర్స్ కార్పొరేషన్ డైరెక్టర్ సింగం రామిరెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్‌ఛైర్మన్ కల్లూరు రమణారెడ్డి, వైసీపీ నాయకులు పుత్తా శ్రీరాములు, కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల పశుసంవర్ధకశాఖ దనాభివృద్ధి కమిటీ ఛైర్మన్ మాధవరెడ్డి, పలువురు వైకాపా నాయకులు శాలువా పూలమాలలతో ఇరువురిని ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అనంతరం బద్వేలు పట్టణానికి విచ్చేసిన వక్స్‌బోర్డు ఛైర్మన్, డైరెక్టర్ ఉమ్మర్ బాషాలను పలువురు మైనార్టీ నాయకులు బాణాసంచా కాల్చి స్వాగతం పలికి శాలువా, పూలమాలలతో సత్కరించారు. మైనార్టీల సమస్యలు పరిష్కరించేలా స్వేచ్ఛ ఇవ్వాలని వైసీపీలో మైనార్టీలకు సముచిత స్థానం కల్పించడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## వడ్డేపల్లికి దారి ఏర్పాటు



రామాపురం, అక్టోబరు 14, ప్రభాతవార్త:

మండలంలోని హసనాపురం పంచాయతీ వడ్డేపల్లికి వెళ్లే దారి ఇరుకుగా ఉండడంతో జేసీబీతో రోడ్డు ఇరువైపులా రాళ్లు ఉండడంతో వాటిని హసనాపురం పంచాయతీకి చెందిన క్లాస్-1 కాంట్రాక్టర్ పాపిరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజారెడ్డి ఉప సర్పంచ్ నాగార్జున, పొట్టిరెడ్డి రమేష్‌రెడ్డిల సహకారంతో గ్రామస్థులు రోడ్డుకు ఇరువైపులా ఉన్న రాళ్లను తొలగించారు. రోడ్డు వెడల్పు చేశారు. ఆ గ్రామంలో బుధవారం ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టారు. సమస్యను ప్రజలు వివరించడంతో సమస్య పరిష్కారమైనట్లు గ్రామస్థులు సూచించారు. దారి ఏర్పాటు చేయడంతో గ్రామస్థులు వారిని అభినందించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

– నిలిచి ఉన్న లారీని ఢీకొని అక్కడికక్కడే మృతి

ఓబులవారిపల్లె, అక్టోబరు 14, ప్రభాతవార్త:



ఓబులవారిపల్లి మండలం కడప - చెన్నై ప్రధాన రహదారి మంగంపేట అగ్రహారం వద్ద నిలిచి ఉన్న లారీని బైక్‌లో వెళ్తున్న సుబ్రమణ్యం ప్రమాదవశాత్తు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి(37) ముగ్గురు పిల్లలు, భార్య కుమారి ఉన్నారు. మృతుడు మంగంపేట ఏపీఎండీసీ నరిసింహులు కాంట్రాక్టర్ వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రైల్వే కోడూరు మండలం శెట్టిపల్లె గ్రామం రాజంపేటకు తరలించినట్లు వారు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

### రోడ్డు ప్రమాదాలపై చర్యలు చేపట్టండి

తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతునే ఉన్నాయని నియంత్రించాల్సిన అధికారులు గట్టి చర్యలు తీసుకొని రోడ్డు ప్రమాదాలు అరికట్టాలని స్థానిక ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగడంతో వారి కుటుంబాలు వీధిన పడి ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బాధిత కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.